# ఉపదేశం

నులక మంచం మీద కూర్చుని టీ తాగుతున్న రంగడి కాళ్లమీద పడింది కొత్త వాయిల్ చీర.

"ఇదా చీర? కొత్త పెళ్లానికి ఎవ్వరైనా ఇలాంటి చవకబారు చీర తెస్తాడా? నాకు ఇది అక్కర్లేదు?" చేతులు తిప్పుతూ విసవిసా లోపలకు వెళ్లిపోయింది రత్తాలు.

పెళ్లాం ఎత్తిపొడుపుకి రంగడి మనసు మూలిగింది. రత్తాలుతో రంగడి పెళ్లి జరిగి మూడునెలలయింది. రంగడెంత ముచ్చట పడి కొన్న వస్తువునైనా పూచికపుల్లలా తీసి పారేస్తోంది. తను కోరే గొంతెమ్మ కోరికలన్నీ ఒక్కసారే తీర్చమంటుంది. తను రిక్షా లాగి సంపాదించే నాలుగు రాళ్లతో అవన్నీ సాధ్యపడడానికి ఇదేమీ తెలుగు సినిమా కాదంటాడు రంగడు.

"మీ ఆయన తెచ్చినదానితో సరిపెట్టుకున్నావంటే వాడు ఎప్పటికీ నిన్ను సుఖపెట్టడు? అవి కావాలి, ఇవి కావాలి అని సతాయిస్తేనే మగాడు తన బాధ్యత తెలుసుకుంటాడు" అని జగదాంబ తన కూతురికి చెప్పుండగా రంగడి చెవిన పడిందొకసారి.

వాళ్లిద్దరు కలిసి ఒక పథకం ప్రకారం తనని సతాయిస్తున్నారని గ్రహించాడు రంగడు. అప్పుడే అతడికి గుళ్లో పురాణం చెప్పే శాస్త్రిగారి మాటలు గుర్తుకు వచ్చాయి. 'లోక కళ్యాణం కోసం అప్పుడప్పుడు మనిషి రాక్షసుడవ్వాలి. అది లోకధర్మం. అలాగే కొన్ని నిజాలు దాచడంవల్ల కొన్ని జీవితాలు బాగుపడతాయి'

ఆయన మాటలు రంగడి మదిలో ఒక పథకం రూపు దిద్దుకోవడానికి దోహదపడింది.

***

"ఏంటీ? దొరగారు ఇంట్లోకి రాలేదు?" వ్యంగ్యంగా ఇంకా ఏదో అనబోతున్న రత్తాలు రంగడి స్వరూపాన్ని చూస్తూనే వణికిపోయింది. చింతనిప్పుల్లా ఎర్రబడినకళ్లు, చేతిలో సారా సీసా.

అప్పుడే వచ్చింది జగదాంబ.

"నువ్వు తాగి రావడానికి వీల్లేదు" ఉక్రోషంగా చెప్పింది రత్తాలు.

"నువ్వెవర్తివే నాకు చెప్పడానికి? ముందుకెళ్లి రత్తాలు మీద చెయ్యి ఎత్తాడు రంగడు.

జగదాంబ అడ్డుపడింది.

అప్పుడే పక్కింటి మహాలక్ష్మి ఈ గొడవకు బయటకు వచ్చి ఆశ్చర్యంగా చూస్తోంది.

"రత్తాలూ! జాగ్రత్తే... నీ మొగుడు చేతిలోనుంచి జారిపోతున్నాడు. ఇంక మనం ఆడ్ని సతాయిస్తే మరీ రెచ్చిపోతాడు. ఇంక ఆడి మనసు కష్టపెట్టకుండా ఆడి మాట విని ఆడ్ని నీ కొంగున ముడేసుకోవాలి. నువ్వు కాదంటే ఆడు రోజూ తాగొస్తాడు" మందస్వరాన కూతురికి చెప్పింది జగదాంబ.

ఆ తరువాత వారిద్దరూ అతడ్ని సాధించలేదు. రంగడు కూడా ఎప్పుడూ తాగి రాలేదు. అంతా సవ్యంగానే ఉంది.

అయితే ఎవరికీ తెలియని విషయమొకటుంది. ఆ రోజు కూడా రంగడు తాగి రాలేదు. కొంచెం సారా చొక్కా మీద పోసుకుని వీరలెవెల్లో నటించాడు. ఈ నిజాన్ని ఎవరికీ చెప్పలేదు.

ఈరకంగా శాస్త్రిగారి రెండో ఉపదేశాన్ని కూడా పాటించాడు రంగడు.

★

-బద్దిగం పాండురంగారెడ్డి

